క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జేవీ కాలనీ, కేంద్రీయ విహార్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 ఏపీహెచ్‌బీ కాలనీ, డీఎల్ఎఫ్ పరిసరాలు, డాగ్ పార్క్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : భిక్షపతి ఎన్‌క్లేవ్, సురక్ష ఎన్‌క్లేవ్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జవహర్‌నగర్ కాలనీ రోడ్డు నెం.1-6, శ్రీదేవి థియేటర్ రోడ్డు, సురక్ష కాలనీ, రాజేందర్‌రెడ్డి కాలనీ, శుభోదయ కాలనీ,సత్య ఎన్‌క్లేవ్, అపర్ణ ప్రాంతాలలో విద్యుత్ ఉండదదని తెలిపారు.

నేడు హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్ వర్క్' పై ఒక రోజు జాతీయ సదస్సును శుక్రవారం ఉదయం 9.45 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సెమినార్‌లో పలువురు వైస్ చాన్స్‌లర్లు, స్టడీస్ డీన్లు, వివిధ శాఖల బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, విభాగాల అధిపతులు, సీనియర్ ఫ్యాకల్టీ ప్రతినిధులు, రిజిస్ట్రార్లు, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొంటారు.

స్లీప్ క్లినిక్ ప్రారంభం

గచ్చిబౌలి: అమర స్లీప్ అవుట్ రీచ్ క్లినిక్‌ను ప్రముఖ దర్శకులు రాఘవేందర్‌రావు గురువారం ప్రారంభించారు. నానక్‌రాంగూడలోని అమరరాజ కార్పొరేట్ ఆఫీస్‌లో అమర స్లీప్ అవుట్ రీచ్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని మాట్లాడుతూ పని ఒత్తిడిలో ఉన్న ఐటీ ఉద్యోగులు నిద్రలేమి సమస్యలతో సతమతమవుతుంటారని, ఈ క్రమంలో స్లీప్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



మియాపూర్ : కామ్రేడ్ తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతి, విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదం శెట్టి రమేష్ పిలుపునిచ్చారు. మియాపూర్‌లోని ఎంఏనగర్‌లో పార్టీ కార్యాలయంలో వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆయన గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14న మియాపూర్‌లోని తాండ్ర స్మారక స్థూపం నుండి ఎంఏనగర్ వరకు ర్యాలీ, ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులు తుకారాం నాయక్, దానయ్య, కళావతి, మురళి, రాజు, దశరథ్ నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లికార్జున స్వామి మహోత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల మల్లికార్జునస్వామి మహోత్సవాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. దేవాలయ కమిటీ చైర్మన్, కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 10న మైలలు తీయుట, 11న గంగపటం, 12న స్వామివారి కల్యాణోత్సవం, 13న నాగవల్లి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని చంద్రారెడ్డి పిలుపునిచ్చారు.

'అన్వయ కేర్'కు హైసియా పురస్కారం



సాక్షి, సిటీబ్యూరో: సీనియర్ సిటిజన్స్‌కు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ), ఐఓటీ ఆధారిత సేవలు అందించే నగరానికి చెందిన అన్వయ కిన్ కేర్ సంస్థకు హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా)పురస్కారం దక్కింది. వృద్ధుల్లో కనిపించే డిమెన్షియా సమస్యకు హోమ్ కేర్, ఐఓటి ఆధారిత స్మార్ట్ ఎమర్జన్సీ సొల్యూషన్స్ అందిస్తున్నందుకు బెస్ట్ ప్రొడక్ట్-ఎస్టాబ్లిష్ట్ కేటగిరీలో ఈ అవార్డ్‌ను రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధులు అందుకున్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా ఫ్లై ఓవర్లే..

- రూ.1,366.17 కోట్ల వ్యయంతో నిర్మాణం
- తాజాగా లింగంపల్లిలో రూ.180 కోట్లతో ఫ్లైఓవర్‌కు గ్రీన్ సిగ్నల్





శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఫ్లైఓవర్లు ఇవే (ఫైల్)

గచ్చిబౌలి: రాష్ట్రంలోనే అత్యధిక ఫ్లైఓవర్లు ఉన్న అసెంబ్లీ సెగ్మెంట్‌గా శేరిలింగంపల్లికి గుర్తింపు వచ్చింది. ఇప్పటి వరకు శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో రూ.1,366.17 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్లు నిర్మించారు. దీంతో సాఫీగా రాకపోకలు, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, సిగ్నల్ లెస్ ప్రయాణం సాధ్యమైంది. నగరంలో అతిపెద్ద ఫ్లైఓవర్లలో రెండవదైన షేక్‌పేట్- రాయదుర్గం- మల్కంచెరువుపై వంతెన కూడా శేరిలింగంపల్లిలో ఉంది. దుర్గంచెరువు కేబుల్ బ్రిడ్జి మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ, రెండు సెంట్రల్ యూనివర్సిటీలు, అతిపెద్ద శిక్షణ సంస్థలు, ఇతర జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఉండడంతో నిత్యం రోడ్లపై రద్దీ విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో పలు ఫ్లైఓవర్లు నిర్మించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రూ.180 కోట్ల వ్యయంతో కొత్తగా లింగంపల్లి కూడలిలో భారీ ఫ్లైఓవర్ మంజూరైంది

మరిన్నిచోట్ల నిర్మిస్తే మేలు..

శేరిలింగంపల్లిలో మరిన్ని చోట్ల ఫ్లైఓవర్లు నిర్మిస్తే రాకపోకలు ఈజీ అవుతాయి. ముఖ్యంగా గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ కూడలి, మియాపూర్ బాచుపల్లి వెళ్లే కూడలి, మియాపూర్ ఆల్విన్ కూడలి, మధురానగర్ దాబా కూడలి, నానక్‌రాంగూడ ఐటీ కారిడార్ విప్రో సర్కిల్ వంటి ప్రాంతాలలో ఈ ఫ్లైఓవర్లను నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతాయి.



సీఎం కేసీఆర్, కేటీఆర్ చొరవతోనే సాధ్యం



ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జిసిటీ, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు కూడా అత్యధికంగా ఉన్నాయి. దీంతో వాహనాల రద్దీ బాగా పెరిగింది. సీఎం ఆదేశంతో మంత్రి కేటీఆర్ చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయడం, అధికారుల తోడ్పాటుతో త్వరితగతిన ఫ్లైఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. దీనికితోడు అండర్‌పాస్‌ల నిర్మాణం కూడా చేయడంతో దాదాపు అన్ని చోట్లా ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తున్నాం.

–ఆరెకపూడి గాంధీ, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే

జంట సర్కిళ్ల పరిధిలో..

గచ్చిబౌలి క్రాస్‌రోడ్స్ ఫ్లైఓవర్	0.95 కిలోమీటర్లు	4 లేను
బయోడైవర్సిటీ పార్కు ఫ్లైఓవర్ లెవెల్	0 0.9 కిలోమీటర్	3 లేన్లు
మైండ్‌స్పేస్ ఫ్లైఓవర్ రహేజా మైండ్‌స్పేస్	0.83 కిలోమీటర్	4 లేన్లు
హైటెక్‌సిటీ ఫ్లైఓవర్	0.7 కిలోమీటర్	4 లేన్లు
హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్	0.7 కిలోమీటర్	4 లేన్లు
బయోడైవర్సిటీ పార్కు లెవెల్-1	0.69 కిలోమీటర్	3 లేన్లు
గచ్చిబౌలి జంక్షన్ లెవెల్-1 ఫ్లైఓవర్	0.8 కిలోమీటరు	3 లేన్లు
దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి	233 మీటర్లు	6 లేన్లు
షేక్‌పేట్-రాయదుర్గం ఫ్లైఓవర్	2.80 కిలోమీటర్లు	6 లేన్లు
లింగంపల్లి ఆర్‌ఓబీ-ఫ్లైఓవర్	0.7 కిలోమీటరు	4లేన్లు
హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్-(ఆర్‌ఓబీ)	0.7 కిలోమీటర్లు	4 లేన్లు
గొలిదొడ్డి-గోపన్‌పల్లితండా ఫ్లైఓవర్	కిలోమీటర్	4 లేన్లు
శిల్పా లేఅవుట్ డైవర్షనల్ ఫ్లైఓవర్	2.81 కిలోమీటరు	4 లేన్లు

మియాపూర్-బీహెచ్‌ఈఎల్ డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



గచ్చిబౌలి: మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు పూణె నమూనా డబుల్ డెక్కర్ (ఒకే పిల్లర్‌పై ఫ్లై ఓవర్, మెట్రో) ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ గురువారం అసెంబ్లీలో ప్రస్తావించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. గచ్చిబౌలి ఔటర్ జంక్షన్‌లో కొండాపూర్ వైపు మల్టీలెవల్ ఫ్లై ఓవర్‌ను ఎప్పుడు పూర్తి చేస్తారో తెలపాలని కోరారు. మియాపూర్‌లోని బొల్లారం చౌరస్తా నుంచి గండి మైసమ్మ వరకు 200 అడుగుల రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, జెఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ, ఉషా ముళ్లపూడి కమాన్ నుంచి గాజుల రామారం వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. మంత్రి కేటీఆర్ స్పందిస్తూ రెండవ దశ ఎస్ఆర్‌డీపీ పనులకు రూ.4,305 కోట్లతో త్వరలో అనుమతిస్తామని చెప్పారు. కొండాపూర్ ఫ్లైఓవర్‌ను ఆగస్టులో అందుబాటులోకి తీసుకొస్తామని, మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



రాయదుర్గం: నూతన విద్యావిధానం వ్యక్తి యొక్క సృజనాత్మకత సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడంపై నొక్కి చెబుతుందని ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కిల్ హబ్ ద్వారా పీఎంకేవివై 3.0 పథకం కింద ఫీల్డ్ టెక్నీషియన్, ఎయిర్ కండీషనర్ శిక్షణను పూర్తి చేసుకున్నవారికి ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్‌వాహిద్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ అర్షియా అజామ్, విస్టా స్కూల్ ప్రిన్సిపల్ శాంతిప్రియ, ఎలక్ట్రానిక్ మెకానిక్ మహ్మద్ అమెర్ పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుపై జెడ్‌సీ సమీక్ష



ఆస్తిపన్ను వసూలుపై డీసీలు, అధికారులతో సమావేశమైన జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: ఆస్తిపన్ను వసూలుపై కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో గురువారం జోనల్ కమిషనర్ మమత సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లకు రోజు వారీ, నెలవారీ టార్గెట్స్ విధించి వసూలు చేయాలని డీసీలను ఆదేశించారు. ఉప కమిషనర్లు వారంలో రెండు సార్లు ఉదయం, సాయంత్రం టార్గెట్స్‌పై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఆస్తి పన్ను విభాగం అధికారులు ప్రతి రోజు ఉదయం 8 గంటల వరకు క్షేత్రస్థాయిలో ఉండి వారి సర్కిల్ వాట్సప్‌లలో పోస్ట్ చేయాలని లేకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీలు రవికుమార్, రవీందర కుమార్, మంగతాయారు, నాగమణి, సహాయ మున్సిపల్ కమిషనర్ కె. శ్రీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌ఆర్‌నగర్‌లో వీధిలైట్లు ఏర్పాటు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్ 2 జీఎస్‌ఆర్ నగర్‌లో మొత్తం 16 వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్నామని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు గురువారం వీధిలైట్ల ఏర్పాటునకు జరుగుతున్న స్తంభాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, సౌకర్యం కోసం డివిజన్ పరిధిలోని డార్క్ స్పాట్లను గుర్తించి వీధిలైట్లను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, గౌడ్, లింగయ్య, సాయి ప్రభాకర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీఎస్ఆర్‌నగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు



భాగ్యనగరకాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న యోగానంద్ తదితరులు

బీజేపీ నాయకుల పర్యటన

భాగ్యనగర్‌కాలనీ: బీజేపీ శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే గజ్జల యోగానంద్ గురువారం భాగ్యనగర్‌కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు డ్రైనేజీ, నీటి సమస్య, కరెంట్ తీగలు కిందకు వేలాడుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. డివిజన్‌లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని పేర్కొన్నారు. ఈ సమస్యలపై 'మీ సమస్య మా పోరాటం' ద్వారా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సైదులు, శ్రీనివాస్, విజిత్‌వర్మ, నవీన్‌గౌడ్, కృష్ణంరాజు, శేషయ్య, బి. కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

గచ్చిబౌలి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయిలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాఘవేంద్రనగర్ కాలనీలో నివాసముండే సూర్యకాంత్ గణపతిరావు(65) ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రాత్రైనా రాకపోవడంతో సమీప ప్రాంతాల్లో వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కొడుకు కపిల్ సూర్యకాంత్ రావు గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ప్రజాగోస-బీజేపీ భరోసా' బహిరంగసభ

శేరిలింగంపల్లి: బీజేపీ శేరిలింగంపల్లి డివిజన్ ఆధ్వర్యంలో 'ప్రజా గోస-బీజేపీ భరోసా శక్తి కేంద్ర బహిరంగసభ ప్రారంభ కార్యక్రమాన్ని శుక్రవారం శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపీనగర్ హనుమాన్ ఆలయ వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు డివిజన్ అధ్యక్షులు రాజుశెట్టి తెలిపారు. ఈ సభల ప్రారంభోత్సవానికి బీజేపీ జాతీయ నాయకులు, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభారి పి మురళీధర్‌రావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని రాష్ట్ర, జిల్లా, అసెంబ్లీ, డివిజన్ నాయకులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్‌అధ్యక్షులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

అభివృద్ధే లక్ష్యంగా సాగుతున్నాం

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల కుడి కుంట పక్కన నిర్మిస్తున్న బతుకమ్మఘాట్‌ను గురువారం రోజారాణి పరిశీలించారు. మహిళలకు ఇబ్బందులు లేకండా బతుకమ్మ ఘాట్‌లను అన్ని హంగులతో నిర్మిస్తున్నామన్నారు. తెలంగాణ పండగలను ఘనంగా చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని కాలనీలను అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్ సాయికిరణ్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పరికి చెరువులో గురువారం దోమల నివారణ మందును పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఎంటమాలజీ సూపర్‌వైజర్ డి. నరసింహులు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి వారం ఇంటి చుట్టు పక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రజలు కూడా చుట్టు పక్కల ప్రాంతాల్లో, నాలాల్లో, చెరువుల్లో వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లను వేయవద్దన్నారు. చెత్తను కాలనీలోకి వచ్చే చెత్త ఆటో వారికి తడి, పొడి చెత్తను వేరు చేసి అందజేయాలన్నారు. ఎంటమాలజి సిబ్బంది, కేటీఆర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ ఆలోచనలను ఆచరణలో పెట్టాలి

రాయదుర్గం: అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగం ఈ దేశానికి రక్ష అని బహుజన వాగ్గేయకారుడు, రచయిత, బహుజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు మచ్చ దేవేందర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో దళిత్ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో ×కుల నిర్మూలన ప్రతిఘటన పాటలు అనే కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ వెలివాడ వేదికగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నానాటికి పాతుకుపోతున్న ఒక సామాజిక రుగ్మత కులం అని అన్నారు. సమాజం స్థిరంగా, క్షేమంగా కొనసాగాలంటే కుల నిర్మూలన జరగాలన్నది డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఆలోచన, అట్లాంటి వారి ఆలోచనలను ఎప్పుడూ ఆచరణ మార్గంలో తీసుకోవాలన్నారు. ప్రముఖ బహుజన రచయిత జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ నిద్రావస్థలో ఉన్న సమాజాన్ని మేల్కొపడానికి పాటలు ప్రాణం పోస్తాయన్నారు. అలాంటి వేల గీతాలు మచ్చ దేవేందర్ రచించారని గుర్తు చేశారు. అంతకుముందు డప్పు కళాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. హెచ్‌సీయూ దళిత్ స్టూడెంట్ యూనియన్ సభ్యురాలు మహేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్‌యూ అధ్యక్షుడు వేణు, కన్వీనర్ కుమార్ రాజా, స్టూడెంట్ యూనియన్ ఉపాధ్యక్షుడు శ్రీచరణ్ పాటు డీఎస్‌యూ విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం

శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్

రాయదుర్గం: సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్ హిల్స్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులను ఆయన వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అంతర్గత రోడ్డులో చేపట్టాల్సిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.



ప్రశాంత్‌హిల్స్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న, ఈఈ శ్రీనివాస్

కనులపండుగగా శ్రీవారి కల్యాణం



హఫీజ్‌పేట్ : మైత్రీనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీవారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు చతుస్థానార్చనలు, నిత్యహోమం, పూర్ణాహుతి, బలిహరణం, 10 గంటలకు జియ్యర్ స్వామిచే మంగళాశాసనములు, శ్రీవారి కల్యాణమహోత్సవం, రాజభోగ నివేదన, తీర్థప్రసాద గోష్ఠి తరువాత అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం హనుమత్ వాహనసేవ నిర్వహించారు.

పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత



శ్రీదేవి థియేటర్ రోడ్డులో మొక్కలు నాటిన కార్పొరేటర్ తదితరులు

మియాపూర్ : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఎంఏ నగర్ స్కూల్‌కు వెళ్లే దారి, శ్రీదేవి థియేటర్ రోడ్డు పక్కన ఖాళీ స్థలంలో వేసిన చెత్తను జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బందితో తొలగింపచేసి ఆ ప్రదేశంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజలు ఇంట్లో చెత్తను, ఖాళీ ప్రదేశాలు, రోడ్ల పక్కన వేయకుండా జీహెచ్ఎంసీ సిబ్బందికి ఇవ్వాలన్నారు. చెత్త సేకరించే ఆటోలు కాలనీలోకి రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పరిశీలన...

దీప్తీశ్రీనగర్‌లోని ఉషోదయ సిగ్నేచర్ అపార్ట్‌మెంట్ సమీపంలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

మహిళా దక్షత సమితి సేవ అభినందనీయం

మియాపూర్: చందానగర్‌లోని మహిళా దక్షత సమితి విద్యా సంస్థల కళాశాల ప్రాంగణంలో బన్సీలాల్ మలాణి నర్సింగ్ కళాశాల 6వ బ్యాచ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారి ముఖ్య అతిథిగా హాజరై సమితి అధ్యక్షురాలు డాక్టర్ స్వరాజ్ బజాజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు వృత్తి పట్ల అంకితభావంతో ఉండాలని తెలిపారు. నర్సింగ్ వృత్తి ఎదుటి వారి జీవితంలో దీపం వెలిగించడమేనన్నారు. కార్యక్రమంలో మున్నా జాగేటియా ,అనురాధ, అనసూయ, లక్ష్మీకుమారి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలపాటిల్, సుమన్ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజేశ్వర్ తివారి